సాక్షి అనకాపల్లి

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



సమస్యల పరిష్కారం

స్పందనలో వచ్చిన వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. 8లో



కేజీహెచ్ ఆధునిక సత్రం రెడీ

విశాఖ: కేజీహెచ్‌లో రోగులు విశ్రాంతి తీసుకునేందుకు రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులు నిధులతో సత్రం సిద్ధం చేశారు.



తొలివిడత చందనం సమర్పణ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం తెల్లవారుజామున తొలివిడత చందనం శాస్త్రోక్తంగా సమర్పించారు.

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణకు శక్తివంచన లేకుండా కృషి



ఎస్పీ మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుసుమశ్రీ కుమారి, ఉమ

అనకాపల్లి టౌన్: జిల్లా గ్రామ, పట్టణ మహిళా సంరక్షణ వెల్ఫేర్ అసోసియేషన్ (సచివాలయాల మహిళా కానిస్టేబుళ్లు) సభ్యులు సోమవారం ఎస్పీ కె.వి.మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖకు.. ప్రజలకు అనుసంధానంగా ఉంటూ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవడం ద్వారా ముందస్తు సమాచారం సులభంగా పొందవచ్చన్నారు. నేర నివారణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ఆటంకం కలగకుండా చేయవచ్చని సూచించారు. గ్రామాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల సమాచారం ఉన్నా ముందస్తుగా స్థానిక ఎస్‌హెచ్‌వోలకు తెలియజేయాలని ఆయన కోరారు. బాల్యవివాహాలను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని, సైబర్ క్రైం తదితర మోసాల పట్ల, రోడ్డు భద్రత నియమాలు, దొంగతనాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గొడ్డపాటి కుసుమశ్రీ కుమారి, ప్రధాన కార్యదర్శి కనిశెట్టి ఉమ, కోశాధికారి గొర్లె వరలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

సమున్నతమైనది న్యాయవాద వృత్తి

జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్



న్యాయమూర్తి ఫణికుమార్‌కు సత్కారం

అనకాపల్లి టౌన్: న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైనదని జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్ అన్నారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాలులో సోమవారం ఒక ప్రైవేటు లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. న్యాయం, అన్యాయం అనే రెండు కోణాల్లో న్యాయవాదులు కోర్టులో వాదోపవాదాలు వినిపించాల్సి ఉంటుందన్నారు. అయితే అందరి లక్ష్యం న్యాయం గెలవడమేనని చెప్పారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ కక్షిదారులకు న్యాయం చేసేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, కరస్పాండెంట్ వెంకటరావు, న్యాయశాస్త్ర అధ్యాపకురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

మే 5న బల్క్ ల్యాండ్స్‌కు వేలం

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏకు చెందిన బల్క్ ల్యాండ్స్ విక్రయానికి మే 5వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 25వ తేదీ నుంచి మే 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు రాష్ట్ర ప్రభుత్వ ఈ–ఆక్షన్ పోర్టల్ https://konugolu.ap.gov.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరవాడ మండలం ఎదులపాక బోనంగి గ్రామంలో 4.5 ఎకరాలు, మధురవాడలో 0.64 ఎకరాలు, అదే ప్రాంతంలో 147/పీ సర్వే నెంబర్‌లో 0.832 ఎకరాలు, 1.755 ఎకరాలు, 0.193 ఎకరాలు, అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో 388/1పీ సర్వే నెంబర్‌లో 6 ఎకరాలు, అందులోనే మరో 3.96 ఎకరాలు విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాల కోసం వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్ www.vmrda.gov.inలో గానీ, కొనుగోలు పోర్టల్‌లో హెల్ప్‌డెస్క్ 08645–246370/71/72/73/74కు సంప్రదించాలని సూచించారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో సోమవారం రాత్రి బయల్దేరిన విశాఖ–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 25వ తేదీన బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో 25వ తేదీన బయల్దేరే విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 26వ తేదీన బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

పంచాయతీల్లో ఉత్తమ స్థానం!

ఉత్తమ పంచాయతీల జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు విశిష్ట స్థానం దక్కింది. వివిధ విభాగాల్లో పలు రాష్ట్ర స్థాయి అవార్డులను దక్కించుకుని ప్రత్యేకతను చాటుకుంది. పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, చైల్డ్ ఫ్రెండ్లీ, సమృద్ధిగా నీరు, పచ్చదనం- పరిశుభ్రత, స్వయం సమృద్ధి, సాంఘిక భద్రత, సుపరిపాలన, ఉమెన్ ఫ్రెండ్లీ అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఆయా పంచాయతీల ప్రతిభ ఆధారంగా ఈ అవార్డుల ఎంపిక జరిగింది. ఒకటి, రెండు, మూడు కేటగిరీలుగా విభజించారు. ఉమ్మడి **విశాఖ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో నాలుగు అవార్డులు దక్కాయి. అనకాపల్లి జిల్లాకు రెండు, విశాఖ, అల్లూరి జిల్లాకు ఒక్కొక్కటి చొప్పున సాధించాయి. ఉమ్మడి** జిల్లా స్థాయిలో ఒక్కో విభాగంలో మూడు చొప్పున తొమ్మిది కేటగిరీలకు 27 పంచాయతీలకు అవార్డులు అందించారు. అందులో అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఐదు, విశాఖ జిల్లాకు రెండు అవార్డులు దక్కగా అనకాపల్లి జిల్లా ఏకంగా 20 పురస్కారాలు సాధించింది.

-సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి

- రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు
- ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో 20..
- సత్తా చాటిన అనకాపల్లి జిల్లా

గ్రామాల ప్రగతితోనే దేశం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'పంచాయతీరాజ్ దినోత్సవం' సందర్భంగా జిల్లాలో ఎంపిక చేసిన ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందజేశారు. అనకాపల్లి జిల్లాలో గల 20 పంచాయతీలకు పురస్కారాలు లభించగా ఆయా పంచాయతీల సర్పంచులకు, కార్యదర్శులకు కలెక్టర్ ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పథకాలను అర్హులందరూ ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మహాత్మా గాంధీ పిలుపునిచ్చిన గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ క్రమంలో ఎదురయ్యే ప్రతీ సమస్యలను సవాళ్లుగా తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి మాట్లాడుతూ...



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

2010 ఏప్రిల్ 24న తొలిసారిగా అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ప్రారంభించారని తెలిపారు. జీఎస్‌వీఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఎల్‌డీవో ఉదయశ్రీ, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈవోకు అవార్డు

మహారాణిపేట (విశాఖ): పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో తొమ్మిది అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 27 పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అవార్డులు అందజేశారు. జిల్లా పరిషత్ ముఖ్యనిర్వహణాధికారి శ్రీరామ్మూర్తి, ఎంపీడీవోలకు ఈ అవార్డులను అందించారు.

రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన పంచాయతీలు..

విభాగం	పంచాయతీ	మండలం
ఆరోగ్యం	తారువ భీమవరం	దేవరాపల్లి హుకుంపేట
సుపరిపాలన	నగరంపాలెం	భీమునిపట్నం
ఉమెన్ ఫ్రెండ్లీ	మార్టూరు	అనకాపల్లి

విభాగాల వారీగా జిల్లా స్థాయి అవార్డులు పొందిన పంచాయతీల వివరాలు ఇలా..

విభాగం	మండలం/ 1వ పంచాయతీ	మండలం/ 2వ పంచాయతీ	మండలం/ 3వ పంచాయతీ
పేదరిక నిర్మూలన	గొలుగొండ/ చీడిగుమ్మల	జి.మాడుగుల/ కిల్లంకోట	నక్కపల్లి/ ఎన్.నర్సాపురం
ఆరోగ్యం	దేవరాపల్లి/ తారువ	హుకుంపేట/ భీమవరం	అనకాపల్లి/ కొత్తూరు
చైల్డ్ ఫ్రెండ్లీ	కె.కోటపాడు/ దాలివలస	మాడుగుల/ కె.వల్లాపురం	యలమంచిలి/ ములకలాపల్లి
సమృద్ధిగా నీరు	కె.కోటపాడు/ డి.అగ్రహారం	రోలుగుంట/ ఎన్.కొత్తూరు	రోలుగుంట/ బుచ్చంపేట
పచ్చదనం, పరిశుభ్రత	జి.మాడుగుల/ జి.మాడుగుల	పాడేరు/ మినుములూరు	మునగపాక/ చూచుకొండ
స్వయం సమృద్ధి	సబ్బవరం/ ఆరిపాక	రాంబిల్లి/ వేల్చేరు	కె.కోటపాడు/ కింతాడ
సాంఘిక భద్రత	అనకాపల్లి/ గోపాలపురం	కోటవురట్ల/ పి.కొత్తపల్లి	యలమంచిలి/ బయ్యవరం
సుపరిపాలన	భీమునిపట్నం/ నగరంపాలెం	జి.మాడుగుల గదుతూరు	నక్కపల్లి/ పెదతీనార్ల
ఉమెన్ ఫ్రెండ్లీ	మునగపాక/ మల్లవరం	భీమునిపట్నం/ నగరంపాలెం	అనకాపల్లి/ మార్టూరు



జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తికి అవార్డులను అందజేస్తున్న విశాఖ జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్

రాష్ట్ర స్థాయి పురస్కారాలు

దేవరాపల్లి/అనకాపల్లి టౌన్: రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలందించిన పంచాయతీలకు సోమవారం విజయవాడలో పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి అవార్డులు అందజేశారు. ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా ఎంపికైన తారువ సర్పంచ్ వరహాలమ్మ, ఉత్తమ మహిళా స్నేహ పురోగతి పంచాయతీగా ఎంపికైన మార్టూరు సర్పంచ్ కరణం వెంకటశివ రెవెన్యూ నాయుడు ఈ పురస్కారాలను అందుకున్నారు. తారువ పంచాయతీ కార్యదర్శి పి.అప్పలనాయుడు, మార్టూరు పంచాయతీ కార్యదర్శి వి.ఈశ్వరరావు, ఎంపీటీసీ మిద్దే రాజాచంద్రరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తమ్ముడి కృషికి సముచిత గౌరవం

తారువ గ్రామాభివృద్ధికి తన తమ్ముడు, ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు చేసిన అవిరళ కృషికి లభించిన అత్యున్నత పురస్కారం ఇదని సర్పంచ్ వరహాలమ్మ చెప్పారు. నాడు తండ్రి బూడి వెంకకునాయుడు, ఆ తర్వాత తమ్ముడు బూడి ముత్యాలనాయుడు, ప్రస్తుతం తాను గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నామని సర్పంచ్ వరహాలమ్మ తెలిపారు. గ్రామంలో 24 గంటలు విద్యుత్ సరఫరా, సోలార్ వీధి లైట్లు, నిత్యం పారిశుధ్య పనులు, దోమల వ్యాప్తి నివారణకు దోమల మందు పిచికారీ, తాగునీటి వృధాను అరికట్టడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు.



రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ కరణం వెంకటశివ రెవెన్యూ నాయుడు



అవార్డు, సర్టిఫికెట్‌తో తారువ సర్పంచ్ గొంప వరహాలమ్మ

శారద నదిపై వంతెన పూర్తి చేస్తాం

రైతులకు ఎంపీ సత్యవతి హామీ

కశింకోట: కశింకోటలోని గవరపేటలో శారద నదిపై అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణం పూర్తి కావడానికి కృషి చేస్తానని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. కశింకోట గ్రామంలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. నదిపై కరోనా సమయంలో నిలిచిపోయిన వంతెన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నదిలో దోనెపై ప్రయాణించారు. పలువురు రైతులు వంతెన నిర్మాణం పూర్తి కావడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందిస్తూ రైతులు తమ పొలాలకు రాకపోకలు సాగించడానికి వంతెన ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, దీని నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్త్రీశక్తి భవనం నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు సమకూరుస్తామన్నారు. అలాగే మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 18 అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తికి తన నిధులు మంజూరు చేస్తామన్నారు. బాల సందనం సందర్శించారు.అక్కడ ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా పిల్లలకు ఇచ్చిన విందు కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. కశింకోటలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన బోర్లను పరిశీలించి అవి ఉపయోగకరమైన ప్రాంతాల్లో వేశారా? లేదా? అనే విషయాన్ని ఆరా తీశారు. మండల గ్రామాల్లో నీటి సమస్య నివారణకు తన నిధుల నుంచి 22 బోర్లు మంజూరు చేశామన్నారు. డాక్టర్ కె.విష్ణుమూర్తి, మండల వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పావని, సచివాలయ సిబ్బంది, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కశింకోటలోని గవరపేటలో శారదానదిపై దోనెలో ప్రయాణిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

జాతీయస్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

నర్సీపట్నం: రాష్ట్రస్థాయి అండర్–17 ఫిడే రేటింగ్ చదరంగం పోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 84 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రసవత్తరంగా సాగిన ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన దొండపాటి ధృవేష్ ప్రథమస్థానంలో నిలిచాడు. అనకాపల్లి జిల్లాకు చెందిన మిద్దె ధనుష్ ద్వితీయస్థానం, కాకినాడకు చెందిన బి.నాగఅఖిల్ చరణ్ తృతీయస్థానంలో నిలిచారు. మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకున్న క్రీడాకారులు పంజాబ్ జలంధర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని అసోసియేషన్ ప్రతినిధులు భీమారావు, జ్వాలముఖి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వి.వెంకటరావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.రాము, కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ బిశ్వాస్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ జోనల్ ఇన్‌చార్జిల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలను నియమించారు. విశాఖ జోనల్ (విశాఖ, అనకాపల్లి, విజయగనగరం జిల్లాల) విద్యార్థి విభాగం ఇన్‌చార్జిగా రెల్ల జానకీరాం (విశాఖ తూర్పు నియోజకవర్గం), జోనల్ ఎస్సీ విభాగం ఇన్‌చార్జిగా అల్లంపల్లి రాజుబాబు (విశాఖ తూర్పు నియోజకవర్గం)లను నియమించారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

క్రిస్టియన్ మైనారిటీ అనుబంధ విభాగ జిల్లా ఇన్‌చార్జిగా సుధీర్‌కుమార్

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా అనుబంధ క్రిస్టియన్ మైనారిటీ విభాగ పార్టీ ఇన్‌చార్జిగా మేకల సుధీర్‌కుమార్ (యలమంచిలి)ను నియమించారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.



అల్లంపల్లి రాజుబాబు



రెల్ల జానకీరాం

త్వరలోనే సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవో

- నిజరూపదర్శన భాగ్యంతో సామాన్య భక్తుల సంతృప్తి
- చందనోత్సవానికి సహకరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్, పోలీస్ కమిషనర్

సాక్షి, విశాఖపట్నం: త్వరలోనే సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవోని నియమిస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ 2.20 లక్షల మంది భక్తులు రావడం కారణంగా కొంతమేర అసౌకర్యం కలిగిందన్నారు. అయినా ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. తెల్లవారు జామున 4 నుంచి 6.30 గంటల మధ్యలో ఎలాంటి ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా దర్శనాలు జరిగాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడం వల్ల కాస్తా గందరగోళ పరిస్థితులు నెలకొన్నా.. కొద్ది గంటల్లోనే పోలీస్ సిబ్బంది.. పరిస్థితులను చక్కదిద్దారని వివరించారు. ఆలయం వెలుపల భక్తుల రద్దీ గమనించిన కలెక్టర్ డా.మల్లికార్జున ఆలయం లోపల ఉన్న భక్తులకు దర్శనం తొందరగా కల్పించి బయటకు పంపించే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారన్నారు. క్యూలైన్లలో భక్తులకు చల్లని మజ్జిగ, మంచినీరు, బిస్కట్లు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువ మందికి దర్శనం కల్పించే ప్రయత్నం అధికారులు చేశారన్నారు. భక్తులు ఉచిత దర్శనం చేసుకునేందుకు ఐదు కిలోమీటర్ల మేర అప్‌హిల్ బస్టాండ్ లోవతోట మీదుగా 2.6 మీటర్ల వెడల్పాటి బారికేడ్లు, రూ.300 భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా 3.9 కిలోమీటర్ల నీలాద్రి గేటు నుంచి 2.6 మీటర్ల బారికేడ్లు, రూ.1000 భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా 2.4 కిలోమీటర్ల మేర మేఐ హెల్ప్ యు నుంచి 2.6 మీటర్లు బారికేడ్లు, రూ.1500 వీఐపీలు, వీవీఐపీ భక్తులు దర్శనం చేసుకునేందుకు 0.3 కి.మీ మేర 2.6 మీటర్ల బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 82 శాశ్వత టాయిలెట్స్, 75 మొబైల్ టాయిలెట్స్, కొండ దిగువన మరో 55 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ అర్ధరాత్రి వరకూ ఉచిత అన్న ప్రసాదం అందించామని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చందనోత్సవం సజావుగా జరిగేలా సహకరించిన భక్తులు, స్థానికులు, అధికారులు, సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డా.త్రివిక్రమ్ వర్మ, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ

కేజీహెచ్‌కు హెచ్‌పీసీఎల్ రూ.2.66 కోట్ల వితరణ

విశాఖపట్నం: కేజీహెచ్‌లోని పది విభాగాల్లో పరికరాల కొనుగోలు కోసం హెచ్‌పీసీఎల్ రూ. 2.66 కోట్లు కేటాయించింది. ఈ మేరకు సోమవారం హెచ్‌పీసీఎల్ అధికారులు జిల్లా కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో ఎంవోయూపై సంతకం చేశారు. కేజీహెచ్‌లో మెరుగైన సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించడంపై కలెక్టర్ అభినందనలు తెలిపారు. హెచ్‌పీసీఎల్ వితరణకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

ఇంటింటా అపూర్వ ఆదరణ

- 'జగనన్నే మా భవిష్యత్తు'కు రాష్ట్రవ్యాప్తంగా చక్కని స్పందన
- 15 రోజుల్లో కోటి కుటుంబాలతో మమేకం
- అన్ని వర్గాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గ్రామాల్లో చక్కటి ఆదరణతో పండగలా సాగుతోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం మాడుగులలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకుల జగన్నినాదాల నడుమ ప్రజల ఆమోదంతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న లబ్ధిని వివరించే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో కన్వీనర్లతో పాటు గృహసారథులు, నాయకులు సుమారు 7 లక్షల మంది సైనికుల్లా పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 65 లక్షల కుటుంబాలను కలవాలన్నది లక్ష్యం కాగా 15 రోజుల్లో కోటి కుటుంబాలను కలిశారన్నారు. ఏ ఇంటికి వెళ్లినా పెద్ద కొడుకులా ఇంటి ముంగిటకే ప్రతి నెల పథకాలు అందజేసి సీఎం జగన్ ఆదుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో తమకు పరపతి పెరిగిందని అవ్వాతాతలు ముందుకొచ్చి చెబుతున్నారంటే అందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలే కారణమన్నారు. ఈ పథకాలతో ఏం చేస్తున్నారని అడిగినప్పుడు.. ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా సొంత కాళ్లపై నిలబడి కుటుంబ పోషణకు అండదండగా నిలుస్తున్నామని, డబ్బులు కూడబెట్టి నగలు చేయించుకుంటున్నామని అక్కచెల్లెమ్మలు చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. తమకు ఆర్థిక స్థోమత లేకపోయినా ఉన్నత చదువులు చదువుతున్నామంటే అది జగన్ మామయ్య ఆలోచనా విధానమేనని విద్యార్థులు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో టీడీపీ వారు కూడా సీఎం జగన్ స్టిక్కర్ గోడలపై అతికించడానికి అంగీకరిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఇంతవరకు 79 లక్షల మిస్డ్ కాల్స్ వచ్చాయని, శతశాతం పూర్తి చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, డెయిరీ డైరెక్టర్ సీరంరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల మండలం సాగరం గ్రామంలో వృద్ధురాలితో ముచ్చటిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

పంచాయతీలకు పురస్కారాలు

అనకాపల్లిలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'పంచాయతీ రాజ్ దినోత్సవం' సందర్భంగా సోమ వారం త్తమ పంచాయతీలకు కలెక్టర్ అవార్డులు అందజేశారు. జిల్లాలోని 20 పంచాయతీలకు పురస్కారాలు లభించాయి. -సాక్షి నెట్‌వర్క్



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నుంచి జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డులు అందుకుంటున్న మాడుగుల మండలం కె.వల్లాపురం సర్పంచ్ టి.రాంబాయి, రోలుగుంట మండలం ఎన్.కొత్తూరు సర్పంచ్ రాజశేఖర్, రోలుగుంట మండలం బుచ్చింపేట సర్పంచ్ ఉలబాల చంద్ర, నక్కపల్లి మండలం పెదతీనార్ల సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, నక్కపల్లి మండలం నర్సాపురం సర్పంచ్ నాగమణి, కె.కోటపాడు గ్రామ సర్పంచ్ అరుణ, కె.కోటపాడు మండలం డి.అగ్రహారం సర్పంచ్ గున్నమ్మ, రాంబిల్లి మండలం వెల్చూరు సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ (ఎడమ నుంచి కుడి)

పాడి పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కలెక్టర్ రవి పటాన్‌శెట్టి

దేవరాపల్లి: పాడి పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కలెక్టర్ రవి పటాన్‌శెట్టి అన్నారు. దేవరాపల్లి మండలం పెదనందిపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో పశు సంవ ర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వ ర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మెగా పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభిం చారు. ఏయే పథకాలు అమలువుతున్నాయి, ఏయే వ్యాధులకు వైద్య సేవలందిస్తున్నారని జిల్లా పశువై ద్యాధికారి బి. ప్రసాదరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల డీడీ కరుణాకర్‌రావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో బి.రామ్మోహన్‌రావు తదితరులను



పెదనందిపల్లిలో పశు సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ రవిపటాన్ శెట్టి



కలెక్టర్ రవి పటాన్‌శెట్టిని సత్కరిస్తున్న ఈర్లె అనురాధ తదితరులు

ఆరా తీశారు. అనంతరం పాడి రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి పశువుల పెంపకం లాభదాయకం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షు రాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ కలెక్టర్ రవి పటాన్‌శెట్టి 'ప్రైమ్ మినిస్టర్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' అవార్డును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకొని అనకా పల్లి జిల్లాకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. కలెక్టర్‌ను సత్క రించారు. విజయవంతంగా వైద్య శిబిరాన్ని నిర్వహించిన అధికారులను కలెక్టర్ అభినందించారు. మెగా పశువైద్య శిబిరంలో మొత్తంగా 283 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విశాఖ డివిజన్ డీడీలు డాక్టర్ కరుణాకర్, డాక్టర్ చంద్రశే ఖర్‌రావు, కె.కోటపాడు, మాడుగుల ఏడీలు జి. బైరాగి, చిట్టినాయుడు, స్థానిక పశువైద్యులు కె.మం జుషారాణి, జి. ప్రియాంక పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

- కలెక్టర్ రవి పటాన్‌శెట్టి
- తారువ, పెదనందిపల్లిలో జగనన్న లేఔట్లలో ఇళ్ల పరిశీలన

దేవరాపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి హౌసింగ్ అధికారులను ఆదేశిం చారు. పెదనందిపల్లి కాలనీ, తారువ జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురో గతిపై స్థానిక హౌసింగ్ ఏఈ భవ్యతేజను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని లేఔట్లలో ఎన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని ప్రారం భం కావాలి, సకాలంలో పేమెంట్లు చెల్లిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడు తున్న ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి ప్రజాప్రతిని ధులు సహకరించాలని జెడ్పీటీసీ, స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, జెడ్ పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్క రరావులను ఆయన కోరారు. గ్రామాల వారీగా లబ్ధిదారులతో సమావేశమై స్థానిక ప్రజాప్రతిని ధుల సహకారంతో ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు అధిగ మించాలని హౌసింగ్ సిబ్బందికి ఆయన సూచిం చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్య క్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, స్థానిక ఎంపీటీసీ రొంగలి నారా యణమ్మ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కేవీ రమణ, ఉగ్రాకుల అప్పారావు, తహసీల్దార్ ఎం .లక్ష్మి, ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ కె.ఉషశ్రీ తదితరులు ఉన్నారు.

ఆరోపణలపై విచారణ

మాకవరపాలెం: రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాన్ని తాకట్టు పెట్టినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నట్టు డీటీ శంకర్రావు తెలిపారు. మండలంలోని రాచపల్లి సచివా లయ పరిధిలో బియ్యం పంపిణీ చేసే వాహనాన్ని డ్రైవర్ తాకట్టు పెట్టినట్టు సోమవారం ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డీటీ మాట్లాడుతూ వచ్చిన ఆరోపణలు వాస్త వామా కాదా? అనే విషయమై విచారణ చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలేనికి చెందిన ఎస్.నూకరాజు (54) మేపుకు గొర్రెలను తోలుకు వెళ్తుండగా సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. నూకరాజును వెనుక నుండి ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నూకరాజును 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడం తో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

టీడీపీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ఏటికొప్పాక నాయకులు

యలమంచిలి: సాధారణ ఎన్నికలు మరో ఏడాదిలో జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష టీడీపీ నుంచి అధి కార వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ఊపందుకుం టున్నాయి. జిల్లాలో తరచూ ఏదో ఒక ప్రాంతంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు జరుగుతున్నాయి. తాజాగా సోమవారం యలమంచిలి మండలం ఏటి కొప్పాక మేజర్ పంచాయతీలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం తీసుకున్నాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. యలమంచిలి పట్టణంలో ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో మామిడి సత్తిబాబు, మామిడి అర్జున, మామిడి ప్రసాద్, అమ్మిడ అప్పలరాజు, అమ్మిన నాగేష్, కాకర రమేష్, గోటాల బండిరాజు, అప్పలరాజు తది తరులకు ఎమ్మెల్యే కన్నబాబురాజు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దీంతో ఏటికొ ప్పాక మేజర్ పంచాయితీలో

ఏటికొప్పాకలో టీడీపీకి షాక్

తెలుగుదేశం పార్టీ గట్టి షాక్ తగిలింది. ఈ సందర్భం గా ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ మరి కొన్ని రోజుల్లో మరింత ఎక్కువ మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి లేని పాలన అందిస్తున్నారని అన్నారు. ఆయన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతు న్నారని పేర్కొన్నారు. మండల వైఎస్సార్‌సీపీ నాయ కుడు సేనాపతి రామును ఎమ్మెల్యే అభినందించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఎంపీపీ బొదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, వి.బంగారుబాబు, దిమిలి రమణబాబు, బుల్లెట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి

తుమ్మపాల: స్పందనలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా తప్పక పరి ష్కరించాలని కలెక్టర్ రవిపటాన్‌శెట్టి అధికారు లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరి గిన స్పందనలో ఆయనతో పాటు జేసీ ఎం.జా హ్నవి, డీఆర్వో పి.వెంకటరమణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు, ఫిర్యాదులకు ఇచ్చే జవాబులు స్పష్టంగా ఉండాలన్నారు. మొత్తం 197 అర్జీలు నమోదయ్యాయి. అత్యధికంగా ఇళ్ల స్థలాలు, రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు అందాయి. సమస్యల వారీగా ఆయా శాఖ లకు స్పందన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి రసీదులు ఇచ్చారు. మెట్ల మార్గంలో వెళ్లలేని వృ ద్ధులు, వికలాంగులకు కిందనే ప్రత్యేక హాలు ఏర్పాటు చేశారు. వారి సమస్యలను డీఆర్వో వెం కటరమణ తెలుసుకుని ఆయా శాఖల అధికారు లకు బదిలీ చేశారు. వివిధ శాఖల జిల్లా అధికా రులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్పందనకు సుదూర ప్రాంతాల నుండి వచ్చే అర్జీదారులను లిఫ్ట్ పని చేస్తున్నప్పటికి అది కేవలం సిబ్బందికి మాత్రమే దీంతో తాము కలెక్టర్‌ను కలవకుండానే వెళ్ళిపోతున్నామని వృద్ధులు, వికలాంగులు వాపోతున్నారు. లిఫ్ట్‌లో వెళ్లేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.



వృద్ధుడి సమస్య వింటున్న ఎస్పీ మురళీకృష్ణ

ఎస్పీ కార్యాలయానికి 40 అర్జీలు

అనకాపల్లిటౌన్: తమ కార్యాలయం స్పందనకు సోమవారం 40 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ చెప్పారు. అర్జీదారుల నుంచి సమ స్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆస్తి తగా దాలు, కుటుంబ కలహాలు, చీటింగ్, ఇతర సమ స్యలపై అర్జీలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, అర్జీదారులు పాల్గొన్నారు.



జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మాడుగుల సర్పంచ్‌కు ఉత్తమ పంచాయితీ అవార్డు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు -మాడుగుల

రెండో అంతస్తు నుంచి జారిపడి మేస్త్రి మృతి

యలమంచిలి: నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాద వశాత్తూ జారిపడి మేస్త్రి దుర్మరణం పాలైన ఘటన పట్టణంలోని నాగేంద్ర కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి నా యుడు తెలిపిన వివరాలివి. కశింకోట మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన అప్పికొండ రాంబాబు (57) అనే వ్యక్తి యలమంచిలి పట్టణంలో నాగేంద్ర కాలనీలో నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి వద్ద పనిచేస్తుండగా భవనం రెండో అంతస్తులో కర్రలతో పరంగీ కడుతూ ప్రమాదవశాత్తూ జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతనిని యలమంచిలి ప్రభు త్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిం చగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందాడని ధ్రువీకరిం చారని, దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన మేస్త్రి అప్పికొండ రాంబాబు

క్రీడాకారుల ప్రతిభకు హర్షం

అనకాపల్లిటౌన్: రాష్ట్రస్థాయి 10వ సబ్‌జూనియర్, జూనియర్, మాస్టర్, స్త్రీ, పురుషుల పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీల్లో అనకాపల్లి జిల్లా ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడం పట్ల క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బద్రీనాథ్ సోమవారం అభినందించారు. ఈనెల 22, 23 తేదీల్లో విశాఖ ఆంధ్రా యూనివ ర్సిటీలో 10వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీల్లో మహిళల 52 కేజీల విభాగంలో ఎ.జ్యోత్స్న స్ట్రాంగ్ ఉమెన్‌తో పాటు బంగారు పతకాన్ని దక్కించుకు న్నారు. 57 కేజీల విభాగంలో జనని కాం స్య పతకం, బాలుర 53 విభాగంలో నాగ మహేష్ కాంస్యం, 93 కేజీల విభాగంలో యశ్వంత్ బంగారు పతకాలు సాధించగా, జూనియర్ 66 విభాగంలో సీహెచ్ లోకేష్ బంగారు, లోవకుమార్ కాంస్య పతకాలు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కాలుష్య నియంత్రణపై బాధ్యత లేదా?

జీవీఎంసీ అధికారులు, సిబ్బంది తీరుపై మేయర్ ఆగ్రహం

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్ర ణలో భాగంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రతి సోమవారం తన సొంత వాహనాలను పక్కన పెట్టి, ప్రజా రవాణా ద్వారా జీవీఎంసీకి వస్తున్న సంగతి తెలిసిందే. క్యాంపు కార్యా లయం నుంచి ఆటోపై జీవీఎంసీకి చేరుకున్న మేయర్..జీవీఎంసీ చుట్టూ భారీ స్థాయిలో ఉద్యోగులు, అధికారులు సిబ్బంది వాహనాలు ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంతవా హనాలతో రావొద్దని ఎంత హెచ్చరించినా అధికారులు, సిబ్బందిలో మార్పు రాకపో వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ చుట్టూ ఎటువంటి వాహనాలు కనిపించ కూడదని సంబంధిత అధికారుల్ని మేయర్ ఆదేశించారు. వారంలో ఒక రోజు బస్సు, ఆటో, సైకిల్‌పైనే జీవీఎంసీకి ఉద్యోగులు చేరుకోవాలని, అలా కాని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమం అనంతరం మేయర్ తిరిగి ఆటోలో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు.



క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి ఆటోపై వచ్చిన మేయర్

దేశానికి గ్రామ పంచాయతీలే పట్టుగొమ్మలు

సందడిగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

చోడవరం: దేశానికి గ్రామ పంచాయతీలే పట్టుగొమ్మలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు చోడవరం మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పంచాయతీలుగా గుర్తిం పు పొందిన గాంధీగ్రామం, లక్కవరం, మైచర్ల పాలెం, చాకిపల్లి, ఖండిపల్లి, లక్ష్మీపురం, శీమునా పల్లి, జుత్తాడ, అడ్డూరు, నర్సాపురం, చోడవరం పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ధర్మశ్రీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలన్నారు. పారిశుధ్యం, వీధిలైట్లు, రోడ్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో సర్పంచ్‌లు పూర్తిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో చైతన్య, వైస్ ఎం పీపీలు బుద్ద గంగరాజు, బైన ఈశ్వరకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులా పల్లి రాంబాబు పాల్గొన్నారు.



గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు, కార్యదర్శిని సత్కరిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె పద్మ

మాడుగుల రూరల్: తండ్రి మృతితో కొడుకులు లేని ఆయనకు కుమార్తె దహన సంస్కారాలు చేసిన ఘటన మండలంలోని కేజేపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పి.బలరామమూ ర్తి (63) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు కుమారి, పద్మ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో సోమవారం ఉదయం చిన్నకుమార్తె పద్మ తండ్రి అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకు వచ్చింది. హిందూ సాంప్రదాయం ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేసిన పద్మ తండ్రి చితికి నిప్పంటించింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

చీడికాడ: మండలంలోని పెదగోగాడకు చెందిన యువకుడు అను మానాస్పద స్థితిలో మృ తి చెందిన ఘటన సోమవారం ఈ ప్రాంతం లో కలకలం సృష్టించిం ది. దీనికి సంబంధించి మృతుడి మేనమామ పోతల కన్నంనాయుడు అం దించిన వివరాలు.. గ్రామానికి చెందిన గోగాడ నర్సింహమూర్తికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు నాని (26). ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరిగాయి. నాని అవివాహితుడు. అతను విశాఖలో ఒక ప్రైవేట్ కంపెనీలో చిరు ద్యోగం చేస్తూ తల్లిదండ్రులను చూసుకుంటు న్నాడు. ఈ నేపథ్యంలో నాని ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామం పెదగోగాడకు వచ్చాడు. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి గ్రామానికి సమీపంలో గల తమ పశువుల పాక వద్ద నిద్రిస్తానని వెళ్లిపోయాడన్నారు. అయితే తెల్లవారి కల్లానికి వెళ్లి చూడగా నాని చెప్పులు, మం చం, కప్పుకున్న దుప్పటి కిందపడి ఉన్నాయని, కేకలు వేసినా స్పందన రాలేదన్నారు. వెతగ్గా పెదగోగాడ, జి.కొత్తపల్లి మధ్య గల బిడ్జి సమీపం లో నేల నూతి వద్ద నాని ఉపయోగించే పల్సర్‌బైక్, మొబైల్ కనిపించాయన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసి నూతిలో గల నీటిని తోడగా నాని మృతదేహం లభించిందన్నారు. అతనికి ఎటువం టి దురలవాట్లు లేవని, ఎవరో కళ్లం వద్దే చంపి రోడ్డు అంచులో గల ఆ నూతిలో పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై ఎస్సై రామారావు మృతదేహానికి పంచనామా నిర్వహిం చి పోస్టుమార్టానికి తరలించారు. మృతుని బం ధువుల ఆరోపణల మేరకు అనుమానాస్పద మృ తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించామన్నారు. సోమున్నిగా పేరున్న నాని మృతితో తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మృతుడు నాని (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

1 నుంచి ఇంగ్లిష్ దస్తూరిపై ఉచిత శిక్షణ

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు లక్ష్మీనారాయణనగర్‌లో మే1 నుంచి 20వ తేదీ వరకూ విద్యార్థు లకు ఉచితంగా ఇంగ్లిష్ దస్తూరి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు కాలిగ్రాఫర్ విశ్రాంతి హెచ్ఎం ఎస్.రామరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నతనంలోనే మంచి దస్తూరి నేర్చుకొని ఉండాలని, విద్యార్థులు ఎంతబాగా చదివినా దస్తూరి సరిగా లేకపోతే మార్కులు సంపాదించడం కష్టమవుతుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు మరిన్ని వివరాలకు 8341646650, 6300385668 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రక్తహీనత నివారణపై దృష్టి పెట్టండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా పోషణ కిట్లను అందజేస్తున్నా ఎనీమియా బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఏమిటని ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎనీమియా లోపం ఉన్నవారి సంఖ్య పెరగకుండా చూడాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. ప్రభుత్వం క్రమం తప్పకుండా పోషణ కిట్లను అందిస్తున్నా ఆ సరుకులన్నీ వారికి సక్రమంగా అందుతున్నాయా అని ప్రశ్నించారు. సరుకులు పారదర్శకంగా అందిస్తున్నా కొందరు మహిళలు వాటిని తినడంలో నిర్లక్ష్యం చూపుతున్నట్టు తాము గుర్తించామని టీచర్లు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. త్వరలో తాను నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తానని అక్రమాలు ఉన్నట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో కె.ధర్మారావు, సీడీపీవో పి.ప్రభావతి, ఏసీడీపీవో శశికళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిక్షా కార్మికులకు టోపీల పంపిణీ

పాయకరావుపేట : పట్టణంలో గల రిక్షా కార్మికులకు శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో టోపీలు, చెప్పులు పంపిణీ చేసినట్టు భజన మండలి కన్వీనర్ వై.శర్మ తెలిపారు. సత్యసాయి బాబా 12 వ ఆరాధన దినోత్సవం సందర్భంగా తుని, పాయ కరావుపేట పట్టణాలకు చెందిన రిక్షా కార్మికులకు టోపీలు, ఆహార పొట్లాలను సరఫరా చేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 1,689 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,170	4,500
మొదటి రకం	3,850	4,100
రెండో రకం	3,460	3,840
మూడో రకం	3,160	3,440

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
కలియుగ భగవాన్	సత్యనారాయణ స్క్రీన్-1
ఈవిల్ డెడ్ రైజ్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
విరుపాక్ష	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
శాకుంతలం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్ 9 యూనిట్లు, ఏబి పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

మట్టి పరీక్ష... పొలానికి రక్ష

- నమూనాల సేకరణలో మారిన విధానం
- భూసార పరీక్ష ఫలితాలతో ఎరువుల ఆదా
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయశాఖ
- ఇప్పటికే వీఏఏలకు శిక్షణ పూర్తి



వీఏఏలకు భూసార పరీక్షలపై శిక్షణనిస్తున్న వ్యవసాయాధికారులు



అనకాపల్లిలో మట్టి సేకరణను పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్ : భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయాలి. పంట సాగు చేసే ముందు ప్రతి రైతు దీనిపై అవగాహన పెంచుకోవాలి. ఒక పంట కోత ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలి. పరీక్ష వల్ల ఏ పంట పండించాలో..రసాయనిక ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. అందువల్ల రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో సిబ్బందికి మట్టి పరీక్షలపై శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశారు.

జీపీఎస్ విధానంతో మట్టి సేకరణ

మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా వ్యవసాయాధికారులు అడుగులు వేస్తున్నారు. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాలను గుర్తించి పంటలు సాగుచేసేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందుకోసం గ్లోబల్ పొజిషినింగ్ సిస్టమ్ (జీపీఎస్)ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

తగ్గనున్న పెట్టుబడి ఖర్చు

అనకాపల్లి మండలంలో 10856 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు పండిస్తున్నారు. భూమికి ఎంత శాతం లవణాలు, మూలకాలు, ఖనిజాల అవసరమో తెలియకుండా ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. ఈ నేపథ్యంలో ఎరువుల వినియోగంలో అనవసర ఖర్చులు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతు భరోసా కేంద్రాల్లో భూసార పరీక్షలు చేయించుకోనే వెసులుబాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడనున్నాయి.

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లనే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల ఇది 0.1 శాతం నుంచి 0.2శాతం వరకు ఉన్నట్టు గత పరీక్షల ద్వారా అధికారులు గుర్తించారు. అందువల్ల మట్టి పరీక్షల ద్వారా భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. తుమ్మపాల, అనకాపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే 48 మట్టి నమూనాలను సేకరించారు.

రైతులకు అవగాహన పెరగాలి



భూసార పరీక్షలపై రైతుల్లో అవగాహన పెరగాలి. మట్టి నమూనా పరీక్ష లేకుండా పంట సాగు చేయకూడదు. మట్టి పరీక్షల ఆధారంగానే యాజమాన్యం చేపట్టి పంట దిగుబడులు సాధించాలి. తద్వారా పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. దీనిపై రైతుల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– పీయుబీపీ రంగాచారి, ఏవో అనకాపల్లి

నాణ్యత లోపిస్తే సహించేదిలేదు

అనకాపల్లిటౌన్ : మండలంలో సత్యనారాయణపురం పంచాయతీ దేవీనగర్ వద్ద ఎంపీ నిధులు రూ.10 లక్షలు, జెడ్పీ నిధులు రూ.7 లక్షలతో నిర్మాణంలో ఉన్న రెండు కల్వర్టు పనులను సోమవారం ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేదిలేదని కాంట్రాక్టర్‌ను ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద చారిటబుల్‌ట్రస్టు వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

బడుగు వర్గాల పెన్నిధిగా సీఎం జగన్

అనకాపల్లిటౌన్: సంక్షేమ ఫలాలను నిర్విరామంగా ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో వల్లూరు, గొర్లివానిపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరై ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కోవిడ్ సమయంలో సంక్షేమ పథకాలు అమలు చేసి బడుగు, బలహీనవర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెన్నిధిగా నిలిచారని చెప్పారు. పథకాలు పేదలకు అందించడాన్ని ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయంటే పేదల పట్ల వారికున్న కపట ప్రేమ అర్థమవుతుందన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగులకు తోడుగా నిలుస్తారన్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న నాయకత్వాన్ని ప్రజలంతా బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల ప్రజలు గొర్లివానిపాలెం శ్మశానవాటికలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గతంలో కోరగా శ్మశానవాటికకు వెళ్లే మార్గంతోపాటు 16 విద్యుత్‌స్తంభాల ద్వారా వెలుగులు నింపడంపై ఆ శాఖ అధికారులను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



అవ్వకు సంక్షేమపథకాల పుస్తకాన్ని అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

జగనన్న లేఅవుట్లో శ్లాబ్ నిర్మాణానికి పూజ

అనకాపల్లిటౌన్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని 80వవార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు అన్నారు. మండలంలో కోడూరు జగనన్న లేఅవుట్‌లో ఆయన సోమవారం మూడు ఇళ్ల నిర్మాణంలో భాగంగా శ్లాబ్‌లకు పూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకుముందు కాంట్రాక్టర్ నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు లోపించకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నేతలు పెంటకోట సన్యాసిరావు, విల్లూరి శేఖర్, పెంటకోట అప్పలనాయుడు, పీలా రాజేష్, సాగర్ పాల్గొన్నారు.



జగనన్న లే అవుట్‌లో శ్లాబ్ నిర్మాణానికి పూజ చేస్తున్న భాస్కరరావు

ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు

కశింకోట: కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 9 విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన పంచాయతీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను ఎంపీపీ కలగా లక్ష్మి అందజేశారు. అత్యధికంగా నాలుగు విభాగాల్లో జెట్టపురెడ్డి తుని, ఈ.చౌడువాడ పంచాయతీలకు పురస్కారాలు లభించాయి. ఉగ్గినపాలెం మూడు, కశింకోట, బయ్యవరం, గొబ్బూరు, మోసయ్యపేట, కొత్తపల్లి రెండు విభాగాలు, అచ్చెర్ల, చింతలపాలెం, ఎఎస్‌పేట, సోమవరం, జి.భీమవరం, తీడ ఒక్కొక్క విభాగంలోను పురస్కారాలు పొందాయి. ఈమేరకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు పురస్కారాలుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో పురస్కారాలు పొందిన పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను అభినందనలు తెలిపారు. వేసవి దృష్ట్యా మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు తమ గ్రామాలకు సంపతిపురం భారీ రక్షిత మంచినీటి పథకం నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, దీంతో ఇబ్బంది పడుతున్నామని, పూర్తి స్థాయిలో నీరు సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను నివేదించాలన్నారు. వీటిని పూర్తి చేయడానికి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి నిధులు సమకూర్చనున్నట్లు పేర్కొన్నారన్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు మంత్రి జయరజని, కోన అరుణ, శ్యాం, కోన నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ పావని, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పురస్కారాలు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మి

కొప్పాకలో నేడు గడప గడపకు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4 గంటలకు జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాకలో నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని ఆయన చెప్పారు. కొప్పాక సచివాల యం పరిధిలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

కోరుకొండ, నవోదయ ప్రవేశ పరీక్షలకు శిక్షణ

అనకాపల్లిటౌన్ : కోరుకొండ సైనిక్, నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్షపై హర్షావిద్యానికేతన్ ఆధ్వర్యంలో ఉచితంగా మే 1వ తేదీన అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇవ్వనున్నట్టు విద్యానికేతన్ డైరెక్టర్ ఎ.సాయిబాబు సోమవారం పేర్కొన్నారు. ఐఐటీ ఫౌండేషన్ తరగతులు కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులు 8184838525 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తో సాధ్యం

పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గొర్లి సూరిబాబు



అనకాపల్లిటౌన్ : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమవుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు గొర్లి సూరిబాబు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడు పట్టణాలు బాగుపడతాయని ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో మార్టురు, తారువా గ్రామ పంచాయతీలకు తొమ్మిది అంశాల్లో రెండు పంచాయతీలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర అవార్డులు తీసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లాలో మిగిలిన పంచాయతీలు కూడా వచ్చే ఏడాదికి 9 అంశాలపై అవార్డులు తీసుకునే విధంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి

అనకాపల్లి రూరల్: రాష్ట్రంలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నిబద్ధతతో కృషి చేస్తున్నారని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం అనకాపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరిగింది. గ్రామాల అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సత్వర సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మకమైన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా చెంతనే అనేక సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించేందుకు సీఎం జగన్ దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని చెబుతూ రాష్ట్రంలో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర్నుంచి చేపట్టిన అనేక సంక్షేమ,అభివృద్ధి,పౌర సేవా కార్యక్రమాలను గురించి వివరించారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైస్ ఎంపీపీ ఐతా ఆనందరాము, ఎంపీడీవో ధర్మారావు,పంచాయతీరాజ్ డీఈఈ(ప్రాజెక్ట్స్) సత్యనారాయణ, మండల స్థాయి అధికారులు,ఎంపీటీసీలు,గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన

- వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు
- రాష్ట్రవ్యాప్తంగా కోటి కుటుంబాల సందర్శన పూర్తయిన సందర్భంగా గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జానకీరామరాజు, సూరిబాబు, గున్నయ్యనాయుడు, మురళి

అనకాపల్లిటౌన్ : జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమలో ప్రతి గృహానికి వెళ్తుంటే ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని, మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని చెప్పడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజల కోరిక మేరకు జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమాన్ని ఈనెల 29వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పట్టణపరిధిలో 85వేల గృహాలకు గాను 65 గృహాలను సందర్శించినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి కుటుంబాలు జగనన్నే మన భవిష్యత్తులో భాగస్వాములయ్యారని చెప్పారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ మండలంలో 32 పంచాయతీ పరిధిలో 85,250 గృహాలకు, 63,600 కుటుంబాల్లో జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమం నిర్వహించామని, మిగిలిన గృహాలను మూడు రోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కశింకోట మండలం పార్టీ అధ్యక్షుడు కలగా గున్నయ్య నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఐదు ప్రశ్నలతో కూడిన పుస్తకంతో గృహాలను సందర్శిస్తున్న సమయంలో మంచి స్పందన వస్తుందని, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ నవరత్నాలో భాగంగా పార్టీలకు అతీతంగా ఒక్కో కుటుంబానికి మూడు నుంచి 5 సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పడంతో ప్రజలకు ప్రభుత్వంపై మరింత నమ్మకం కలిగిందన్నారు. అనంతరం జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో కోటి కుటుంబాలు పూర్తి అయిన సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, కార్యదర్శి గైపూర్ రాజు, పార్టీ నేతలు కె.కన్నబాబు, కోన ఉమ పాల్గొన్నారు.

ఘనంగా గొల్లవిల్లి జన్మదిన వేడుకలు

కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు సోమవారం పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. శ్రీనివాసరావు సతీమణి, సర్పంచ్ గొల్లవిల్లి జయ దంపతులను గజమాలలు, పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు, దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ గున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు, అనకాపల్లి ఎంపీపీ గొర్లె సూరిబాబు, అనకాపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, అనకాపల్లి పట్టణ కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మలసాల కిషోర్, కాపు సంఘం నాయకుడు గొన్నాబత్తుల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు నాగసత్యనారాయణ, ఉప సర్పంచ్ చోడే లక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నానాజీ, బాబూరావు పాల్గొన్నారు.



గొల్లవిల్లి శ్రీనివాసరావుకు కేక్ తినిపిస్తున్న పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

నేడు శోభాయాత్ర

అనకాపల్లిటౌన్ : పట్టణంలో సుంకరమెట్ట సూర్యనారాయణ స్వామి ఆలయం నుంచి నెహ్రూచౌక్ వరకు మంగళవారం శోభాయాత్ర నిర్వహించనున్నామని ఏపీ చాత్తాద వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సేవాసంఘం సభ్యులు సోమవారం పేర్కొన్నారు. శ్రీరామానుజాచార్యుల వారి తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఈ యాత్రలో అధికసంఖ్యలో భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి 12వ ఆరాధనా దినోత్సవాన్ని పురస్కరించు కుని వైద్యాలయంలో రోగులకు సోమవారం పాలు, రొట్టెలు, పళ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి నిర్వాహకులు గుంపాన రమేష్‌గుప్తా, విల్లూరి పైడారావు మాట్లాడుతూ సత్యసాయి ఆరాధన దినోత్సవం సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు రామకృష్ణ, విల్లూరి మోదినాయుడు, ఆరంగి సంతోష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో వాసవీ స్వయం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పాదచారులకు ఉచిత మజ్జిగ, తాగునీరు, సోడాలు పంపిణీ చేశారు. నెల రోజుల పాటు సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ నిర్వాహకులు కడిమిశెట్టి సతీష్ తెలిపారు.



ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న విల్లూరి పైడారావు

జోరుగా ఇసుక అక్రమ రవాణా!

ఎస్.రాయవరం : మండలంలో గ్రావెల్, మట్టి అక్రమ రవాణాదారులు పేట్రేగిపోతున్నారు. గ్రామాల్లో రియల్ ఎస్టేటు ప్లాట్లకి మంచి గిరాకీ పెరగడంతో ఇసుక అక్రమ రవాణా జోరు పెంచారు. పెద గుమ్ములూరు, గుడివాడ, రామయ్యపట్నం గ్రామాల్లో గ్రావె ల్ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. రాత్రుళ్లు ఈ తవ్వకాలు మరింత జోరుగా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అదే క్రమంలో సర్వసిద్ధి, వమ్మవరం , కొరుప్రోలు తదితర గ్రామాల్లో , చెరువు మట్టి తరలించుకుపోయే వారు ఎక్కువ అయ్యారు. ఈ క్రమంలో ప్రతి రోజూ మట్టి, గ్రావెల్ అక్రమ రవాణాదారులు పెద్ద ఎత్తున తరలించుకుపోతున్నారు. వీటిని అడ్డుకునేందుకు ఆయా శాఖలు అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇరిగేషన్, భూగర్భ గనులశాఖ అధికారులకు సమాచారం తెలిసినా వీటివైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, జగనన్న కాలనీల్లో పునాదులు కప్పుకోవడానికి తొట్టె మట్టి కావాలని వినతులు చేసుకున్నా లబ్ధిదారులకు ఇవ్వని అధికారులు అక్రమ రవాణాదారులకు మాత్రం కొమ్ము కాస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా నిలువరింపజేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ

ఎస్.రాయవరం : లింగరాజుపాలెంలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. గ్రామంలో ఈనెల 22న పద్మావతి, వీరన్నల ఇంటిదారి స్థలం విషయంపై వివా దం జరిగిందని, ఈమేరకు నమో దైన కేసులపై విచారణ చేపట్టినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తకుండా 10 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

న్యాయంపూడిలో తాటాకిల్లు దగ్ధం

నక్కపల్లి: మండలంలోని న్యాయంపూడిలో ఆదివారం అర్ధరాత్రి కాకడ సింహాద్రికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. అగ్నిప్రమాదం సంభవించడంతో ఇంట్లో ఉన్న దుస్తులు, నిత్యావసర సరుకులు, కూలి పని చేసుకుని సంపాదించిన కొద్దిపాటి నగదు వంటపాత్రలు, ఫర్నిచర్ సర్వం కాలి బూడిదవ్వడంతో బాధితుడు కాకాడ సింహాద్రి కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. వ్యవసాయ కూలి పనులపైనే ఆధారపడి జీవిస్తున్నామని, అర్ధరాత్రి మంటలు అంటుకోవడంతో భయంతో బయటకు పరుగులు తీశామని బాధితులు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని కారణంగా పెంకుటిల్లు నిర్మించుకోలేకపోయామని కట్టుబట్టలతో మిగిలిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంది.